# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 23 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## దివ్యాంగులకు 4 శాతం ఇళ్ల కోటా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్య హౌసింగ్ స్కీంలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్‌ను కల్పించారు. సమాజంలో ఈ వర్గాలు వెనుకబడకుండా ఉండేందుకు , వారి సమీకృత అభివృద్ధికి ఈ కోటాను ఖరారు చేశారు. ఏ విధమైన వికలాంగత ఉన్న వారికైనా ఇప్పుడు కల్పించే కోటాతో వారు సొంతింటి వారు కావడానికి అవకాశాలు మెరుగుపడుతాయి. వారిసాధికారికతకు దోహదం చేసినట్లు అవుతుందని గురువారం వెలువరించిన అధికారిక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల చట్టం 2016 సంబంధిత హక్కులకు అనుగుణంగా కేంద్రం ఈ చొరవ తీసుకుందని వివరించారు. ప్రధాని మోడీ ప్రతిపాదిత సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ సందేశం స్ఫూర్తిగా ఈ కోటా కల్పించారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాల కల్పనకు కట్టుబడి ఉండేలా రూపొందించిన సుగమయ భారత్ అభియాన్‌లో భాగంగా వికలాంగులకు ఈ 4 శాతం కోటా ఏర్పాటు జరిగిందని హౌసింగ్ మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో తెలిపింది.

# బ్యాంకులు సహకరించాలి

- గిరిజన రైతులకు సోలార్ పంప్ సెట్లు
- మహిళా సంఘాలకు వడ్డీలేని రూ.1 లక్ష కోట్లు రుణాలు
- ప్రపంచ స్థాయిలో ఉద్యోగ అవకాశాలకు యువతకు శిక్షణ
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే వినూత్న పథకం రాజీవ్ యువ వికాసం లక్ష్యాల సాధన కోసం బ్యాంకులు సమయపాలితంగా సహకరించాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న రాజీవ్ యువ వికాసం ద్వారా ఎంపికైన ఐదు లక్షల అర్హులైన యువతకు ఆర్థిక సహాయం ఆమోద పత్రాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకాన్ని జాప్యం లేకుండా అమలు చేయడంలో బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని ఆయన అన్నారు. ఈ మేరకు బ్యాంకులు ఒక రాష్ట్రస్థాయి నోడల్ అధికారిని నియమించి అన్ని బ్యాంకులతో సమన్వయం చేయాలని సూచించారు. ఈ పథకానికి రూ.6,250 కోట్ల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా యువతలోని ఉద్యమా నైపుణ్యాలను వెలికితీసి, రాష్ట్ర స్థూల గృహ ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది.

### రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం

విద్యా, ఆర్థిక శాఖలను కూడా చూసే భట్టి విక్రమార్క, మే 22, 2025న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ప్రసంగిస్తూ, ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు నిర్ణయించిన లక్ష్యాలను చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### వ్యవసాయ రంగంపై ప్రధాన దృష్టి

వ్యవసాయాన్ని ప్రాధాన్యతగా తీసుకుని, తోటల సాగు మరియు ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహకానికి ప్రభుత్వముదిగి ఉందని చెప్పారు. రైతుల రుణ మాఫీ భాగంగా రూ.21,000 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామని, రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామని, కృషి బీమా ప్రీమియంలను కూడా ప్రభుత్వం చెల్లిస్తోందని పేర్కొన్నారు.

### గిరిజన రైతులకు సోలార్ పంప్ సెట్లు

గిరిజన రైతులకు ప్రత్యేకంగా ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించి, 100% సబ్సిడీతో సోలార్ పంప్ సెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే ఐదేళ్లలో అర్హులైన గిరిజన రైతులకు ఉచితంగా పంప్ సెట్లు అందించేందుకు రూ.12,600 కోట్లు కేటాయించారు.

### మహిళా సంఘాలకు వడ్డీలేని రూ.1 లక్ష కోట్లు రుణాలు

మహిళా సాధికారతపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, రాష్ట్ర అధికారం చేపట్టిన తర్వాత మహిళా స్వయం సహాయ సంఘాలకు రూ.20,000 వడ్డీలేని రుణాలు మంజూరు చేశామని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రూ.1 లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు మహిళా సంఘాలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వీరికి ఆర్థిక సహాయంతో పాటు వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలను %యాక్మజ%కి లీజుకు బస్సులు కొనుగోలు చేయడానికి ప్రోత్సహించామని, విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంలో పాల్గొనడానికి కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం 2030 నాటికి 20,000 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది.

### ప్రపంచ స్థాయిలో ఉద్యోగ అవకాశాలకు యువతకు శిక్షణ

యువత సాధికారతకూ ప్రాధాన్యత ఇచ్చి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యను ప్రోత్సహించామని చెప్పారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆధునిక సాంకేతిక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయిలో ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

# 22 నిమిషాల్లోనే ప్రతీకారం తీర్చుకున్నాం

- తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం చేశాం
- పాకిస్తాన్ భారీ మూల్యాన్ని చెల్లించాలి
- మూడు దళాలకూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం
- పాకిస్తాన్‌ను మోకాళ్లపై సాగిలపడేలా చేయడానికి భారత సైన్యం చక్రవ్యూహం రచించింది
- భారత్ ప్రతీకార దాడి చేస్తే ఫలితం ఎంత ఘోరంగా ఉంటుందో ప్రపంచానికి చూపించాం
- ప్రధాని మోడీ
- 103 అమృత్ స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి ప్రతిగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో 22 నిమిషాల్లోనే ప్రతీకారం తీర్చుకుందని ప్రధాని మోడీ అన్నారు. 22 నిమిషాల్లో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం చేశామని తెలిపారు. రాజస్థాన్‌లోని బికనీర్‌లో అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించిన అనంతరం పలానాలో జరిగిన ప్రజా ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఉగ్రదాడులకు పాల్పడుతున్న పాకిస్తాన్ భారీ మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందని, అది ఆ దేశ సైన్యం, ఆర్థిక వ్యవస్థ భరించాల్సి వస్తుందన్నారు. పాక్ ఉగ్రవాదం ఎగుమతిని కొనసాగిస్తే, ఆ దేశం ఒక్క రూపాయి కోసం కూడా తడబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. భారతీయుల రక్తంతో ఆడితే పాకిస్తాన్ దానికి భారీ మొత్తంలో నష్టం చవిచూడాల్సి వస్తుందన్నారు. ఉగ్రవాదం అంతానికే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని, ఇకపై ఉగ్ర దాడి జరిగినట్లయితే, తక్షణమే దానికి కఠిన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు.. ఇందుకు సమయాన్ని, విధానాన్ని, నిబంధనలను భారత సైన్యం స్వయంగా నిర్ణయిస్తుందన్నారు. అణ్వాయుధాల బెదిరింపులతో భారతదేశం వెనక్కి తగ్గబోదని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వ్యక్తులను, ప్రభుత్వాన్నీ వేరు చేయలేమని ప్రధాని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌లో 'స్టేట్', 'నాన్–స్టేట్ యాక్టర్స్' (గూండాలు) కలిసి ఆడే ఆటలు ఇక కొనసాగవన్నారు.

భారత్ ప్రతీకార దాడి చేస్తే ఫలితం ఎంత ఘోరంగా ఉంటుందో ప్రపంచానికి స్పష్టంగా చూపించామని, ప్రతి భారతీయుడు ఉగ్రవాదాన్ని నేలమట్టం చేయాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. భారత సైన్యం ప్రజల ఆశీర్వాదంతో ఆ సంకల్పాన్ని నెరవేర్చిందన్నారు. భారత ప్రభుత్వం మూడు దళాలకూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. పాకిస్తాన్‌ను మోకాళ్లపై సాగిలపడేలా చేయడానికి భారత సైన్యం చక్రవ్యూహం రచించిందని ప్రధాని మోదీ అన్నారు.

## 103 అమృత్ స్టేషన్లను ప్రారంభించిన ప్రధాని

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో



ప్రధాని నరేంద్ర మోడీ గురువారం రాజస్థాన్‌లోని ఎనిమిది స్టేషన్లతో సహా 18 రాష్ట్రాలలో 103 పునరాభివృద్ధి చేసిన అమృత్ స్టేషన్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో ఒకరోజు పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ముందుగా రాజస్థాన్‌లో రూ. 26 వేల కోట్ల విలువైన కీలకమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ ప్రాజెక్టులను ప్రారంభించారు. 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల జాబితాలో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు, ఏపీలోని సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ఉన్నాయి.

ప్రధాని భారత వైమానిక దళానికి చెందిన నల్ ఎయిర్ బేస్‌కు చేరుకున్నారు. అక్కడి దేశ్‌నోక్‌లోని కర్ణి మాత ఆలయంలో ప్రార్థనలు చేశారు. అనంతరం రాష్ట్రంలోని ఎనిమిది స్టేషన్లతో సహ 18 రాష్ట్రాలలో 103 పునరాభివృద్ధి చేసిన అమృత్ స్టేషన్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే బికనీర్–ముంబై ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. చురు–సాదుల్‌పూర్ రైలు మార్గానికి కూడా ఆయన పునాది రాయి వేశారు. బహుళ విద్యుదీకరించిన రైల్వే మార్గాలను జాతికి అంకితం చేశారు. సరిహద్దు కనెక్టివిటీని పెంచడానికి అనువైన రూ. 4,850 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాల అనంతరం పలానాలో జరిగిన ప్రజా ర్యాలీలో ప్రధాని ప్రసంగించారు.

# మళ్లీ ఎన్‌కౌంటర్.. ఒక మావోయిస్టు మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తుమ్రేల్ దండకారణ్యంలో మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక హార్డ్‌కోర్ మావోయిస్టు మృతి చెందారు. ఆ కాల్పుల్లో ఒక జవాన్ కూడా మృతి చెందారు. మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలైనట్టు బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. గాయపడిన వారికి చికిత్స కొనసాగుతోంది. సుక్మా, బీజాపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న తుమ్రేల్ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిపై సమాచారం ఆధారంగా.. కోబ్రా, జిల్లా సుక్మా డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్‌ల సంయుక్త పోలీసుల బృందానికి, మావోయిస్టులకు మధ్య గురువారం ఉదయం నుంచి కాల్పులు కొనసాగాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో గాలింపు చేపట్టగా, ఇప్పటివరకు ఒక మావోయిస్టు మృతదేహం, ఆయుధాలు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

# కేసీఆర్‌తో హరీశ్‌రావు మరోసారి భేటీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కెసిఆర్‌తో మాజీ మంత్రి హరీష్‌రావు మరోసారి భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీష్‌రావు,ఈటల రాజేందర్‌కు మంగళవారం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు రోజుల కేసీఆర్‌తో ఎర్రవల్లి నివాసంలో హరీష్‌రావు సమావేశం కాగా, గురువారం మరోసారి భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులపె సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. నోటీసులకు ఎలా స్పందించాలన్న అంశంపై ఇరువురు మంతనాలు జరిపినట్లు సమాచారం. అయితే, కమిషన్ ముందు కెసిఆర్, హరీష్‌రావులు విచారణకు హాజరవుతారా..? లేదా లేక తమ ప్రతినిధి ద్వారా కమిషన్‌కు సమాధానం ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది.

## నకిలీ ఓఎస్డీ అరెస్ట్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయంలోని ఓఎస్డీగా పని చేస్తున్నట్లు చెప్పి ప్రముఖ వ్యాపారవేత్తలను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఓ మాజీ క్రికెటర్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బుడుమూరు నాగరాజు అనే వ్యక్తిని ఆంధ్రప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు తరలించి రిమాండ్‌కు తరలించారు. సీఎం ఓఎస్డీ పేరుతో నకిలీ ఈ–మెయిల్ ఐడీని సృష్టించాడని అధికారులు గుర్తించారు. ఈ నకిలీ గుర్తింపుతో ర్యాపిడో, కంట్రీ డిలైట్ వంటి ప్రముఖ కంపెనీల ఎండీలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినట్లు పోలీసుల విచారణలో తేల్చారు. పలు రియల్ ఎస్టేట్ కంపెనీల ఛైర్మన్‌లకు వాట్సాప్ సందేశాలు పంపినట్లు కూడా దర్యాప్తులో తేలింది. బుడుమురు నాగరాజుపై ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 30 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# ఈడీ అన్ని హద్దులూ దాటుతోంది

- ఫెడరల్ నిర్మాణాన్ని ఉల్లంఘిస్తున్నారు
- సుప్రీంకోర్టు
- టీఏఎస్ఎంఏసీపై దర్యాప్తు నిలుపుదల



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ అన్ని హద్దులూ దాటుతోందని వ్యాఖ్యానించింది. సమాఖ్య పాలన భావనను ఈడీ ఉల్లంఘిస్తోందన్న ఆక్షేపించింది. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తును వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ.1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈడీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టాస్మాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇటీవల సోదాలు జరిపారు. ఆ సంస్థ ప్రధాన కార్యాలయం, టాస్మాక్ అధికారుల ఇళ్లల్లో ఈ ఏడాది మార్చి, మే నెలల్లో తనిఖీలు చేపట్టింది. దీంతో ఈ సోదాలపై తమిళనాడు సర్కార్ హైకోర్టుకు వెళ్లింది. అక్కడ ఈడీ చర్యలను మద్రాస్ హైకోర్టు సమర్థించింది. విచారణ పేరిట టస్మాక్ అధికారులను ఈడీ వేధిస్తోందంటూ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేస్తూ.. ఈడీ దర్యాప్తుకు అనుమతించింది. దీనిపై స్టాలిన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

దీనిపై తాజాగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈడీ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఈడీ 'అన్ని హద్దులూ మీరుతోంది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాఖ్య పాలన భావనను ఈడీ ఉల్లంఘిస్తోందన్న ధర్మాసనం.. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తును వెంటనే ఆపేయాలని ఆదేశించింది. సుప్రీం తీర్పును డీఎంకే ప్రభుత్వం స్వాగతించింది.

## దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం




- యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తామని, తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బేగంపేట , కరీంనగర్ , వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్టు తెలిపారు. తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ( ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం అని తెలిపారు.

## నాపై తప్పుడు కేసులు పెట్టారు

- సీఎం రేవంత్‌రెడ్డి
- కోర్టుకు హాజరైన ముఖ్యమంత్రి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ తనపై పోలీసులు చేసిన ఆరోపణలు అవాస్తవాలని, తానేం తప్పు చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోర్టుకు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోడ్ ఉల్లంఘించారని గతంలో నమోదైన కేసులో గురువారం రేవంత్ రెడ్డి నాంపల్లి మనోరంజన్ కోర్టుకు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ బ్రేక్ చేశారని మెదక్, బేగంబజార్, నల్గొండ, మెదక్ పోలీస్ స్టేషన్‌లలో రేవంత్ రెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా గురువారం కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి తాను ఎలాంటి తప్పు చేయలేదని పోలీసులు చెబుతున్నవి అవాస్తవాలని ఆయన చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ తప్పుడు కేసులు నమోదు చేసినట్లు కోర్టుకు తెలిపారు. రేవంత్ రెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న కోర్టు జూన్ 12న తీర్పు ప్రకటిస్తామని పేర్కొంది. కాగా, ముఖ్యమంత్రి హోదాలో కోర్టుకు హాజరుకావడం రేవంత్ రెడ్డికి ఇది రెండోసారి.



## కేసీఆర్‌కు కవిత సంచలన లేఖ..!

- సోషల్ మీడియాలో వైరలవుతున్న లెటర్
- ఫేక్ ప్రచారమంటూ కొట్టిపారేస్తున్న కొందరు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కూతురు, ఎమ్మెల్సీ కవిత సంచలన లేఖ రాసినట్టు తెలుస్తోంది. అందుకు సంబంధించిన లేఖ వైరలవుతోంది. ఈ లేఖలో ఏముందంటే... పార్టీ లీడర్స్‌కి యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖలో ఆరోపించారు. మై డియర్ డాడీ అంటూ కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత.. బీజేపీతో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై తన సందేహాలను వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తు అంశంపై సిల్వర్ జూబ్లీ సభలో కూడా క్లారిటీ ఇవ్వలేదన్నారు. బీజేపీ మీద రెండు నిమిషాలే మాట్లాడారని.. ఆ పార్టీపై ఇంకా బలంగా మాట్లాడాల్సిందని కవిత అభిప్రాయపడ్డారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటారేమో అనే చర్చ మొదలైందన్నారు. బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందని అని లేఖలో అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు.

కాంగ్రెస్‌పై గ్రాస్‌రూట్స్‌లో నమ్మకం పోయిందన్న కవిత.. బీజేపీ ఆల్టర్‌నేటివ్ అనే ఆలోచనను మన కేడర్ చెబుతోందన్నారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా.. బీజేపీకి హెల్ప్ చేశామనే మెసేజ్ కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింది. కేసీఆర్ యాక్సెస్ దొరకడం లేదని, సెలెక్టివ్ యాక్సెస్ అని జడ్పీటీసీ, జడ్పీ ఛైర్మన్లు, ఎమ్మెల్యే స్థాయి నేతలు బాధపడుతున్నారు. అందరికి అందుబాటులో ఉండేలా ప్రయత్నించండి. వరంగల్ సభలో ఉద్యమ నేతలకు సరైన ప్రాధాన్యం దక్కలేదు. 2001 నుంచి మీతో ఉన్నవారికి మాట్లాడే అవకాశం ఇస్తే బావుండేది. పాత ఇన్‌చార్జ్‌లకే బాధ్యతలు ఇవ్వడం కూడా కేడర్‌కు నచ్చలేదు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నవారికి.. నేరుగా పార్టీ ఆఫీసు నుంచే బీ ఫామ్స్ ఇవ్వాలి. వరంగల్ సభలో ఉర్దూలో మాట్లాడలేదు, వక్ఫ్ బిల్లుపై మాట్లాడలేదు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం అంశాన్ని విస్మరించారు.' అని లేఖలో సంచలన అంశాలను ప్రస్తావించారు. అయితే ఈ లేఖ ఫేక్ అని కొందరు కొట్టిపారేస్తున్నారు.

# పాతబస్తీ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ మహానగరాన్ని ప్రపంచ నగరంగా తీర్చిదిద్దడానికి ఎన్ని నిధులనైనా వెచ్చించడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పాత బస్తీ(ఓల్డ్ సిటీ) పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని శాసనసభ్యులు హాజరయ్యారు. చార్మినార్, మలక్‌పేట్, కార్వాన్, యాకుత్ పురా, చంద్రాయణ గుట్ట, బహదూర్‌పూరా, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న పనులపై సమీక్షించారు. వాటి పురోగతిపై డిప్యూటీ సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పాత నగరంలో ఉన్న వారసత్వ నిర్మాణాలను కాపాడుకుంటూ పాత నగరాన్ని బాగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి గత బడ్జెట్‌లో రూ. పది వేల కోట్లను కేటాయించామనీ, ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిన చరిత్ర ముందెన్నడూ లేదన్నారు. మహానగరాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని ముందుకు వెళ్తుందనీ, అందులో భాగంగానే మూసీ పునర్జీవం, మెట్రో రైల్ విస్తరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.

నగరవాసులకు కృష్ణా, గోదావరి నది జలాల ద్వారా తాగునీరు అందించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. గత పదేండ్లు అధికారంలో ఉన్న పాలకులు అదనంగా ఒక్క ఎంఎల్డీ నీటిని కూడా హైదరాబాద్‌కు తీసుకురాలేదని చెప్పారు. రానున్న ఐదేండ్లకు నగర వాసులకు సరిపోను మంచినీటిని సరఫరా చేయడానికి రూ.7,400 కోట్లతో గోదావరి ఫేజ్ 2, ఫేజ్ – 3ను పూర్తి చేయనున్నామని తెలిపారు. తద్వారా 20 టీఎంసీల నీళ్లను తీసుకురానున్నామని చెప్పారు. ఇందులో ఐదు టీఎంసీలు మూసీ పునర్జీవం కోసం, 15 టీఎంసీలు హైదరాబాద్ నగర ప్రజల తాగు నీటి కోసం వాడుతామని వెల్లడించారు. నగరంలో 2014కు ముందు ఆనాటి ప్రభుత్వాలు 25 ఎస్టీపీలు నిర్మాణం చేయగా, పదేండ్ల కాలంలో గత పాలకులు కేవలం 20 ఎస్టీపీల నిర్మాణాన్ని మాత్రమే చేపట్టారనీ, ప్రజా ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలోనే రూ.3,840 కోట్లతో 39 ఎస్టీపీలను నిర్మాణం చేస్తుందని వెల్లడించారు.

ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణ గుట్ట వరకు రూ.2,714 కోట్లతో 7.5 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపించామని భట్టి తెలిపారు. ఇందులో భాగంగా రోడ్డు విస్తరణ పనులు పాత నగరంలో శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జేబీఎస్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి షామీర్‌పేట్, శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోరైల్ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించామని వివరించారు. పాత నగరంలో ఇప్పటి వరకు 42 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా ఈ ఏడాది అదనంగా 18 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఇటీవల గుల్జార్ హౌస్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగి 17 మంది చనిపోవడం బాధాకరమని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోకపోతే చరిత్ర క్షమించదన్నారు. హైదరాబాద్‌లో అగ్నిప్రమాదాల నివారణకు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిటీ వేశారని గుర్తు చేశారు. ఆ నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం తీసుకుని చేపట్టే సంస్కరణలకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

# సుందరీమణులు, గ్రామీణ శ్రామిక మహిళలు సమానమే

● మంత్రి సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్**





సుందరీమణులు, గ్రామీణ శ్రామిక మహిళలు సమానమేనని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి బజార్‌ను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిస్ వరల్డ్ పోటీదారులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించేందుకు మహిళా సంఘాల ద్వారా ఎన్నో రకాల వ్యాపారాలను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. మహిళా ప్రగతి సమాజ ప్రగతి అన్న అంబేడ్కర్ ఆశయాన్ని ఆచరణలో చేసి చూపిస్తున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీదారులు తెలంగాణ చారిత్రక సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను సందర్శించడం అభినందనీయమని చెప్పారు. అవి కేవలం చారిత్రక ప్రదేశాలే కావని, కష్టానికి, తెగింపునకు, పోరాటానికి కేంద్రాలని చెప్పుకొచ్చారు.

నాగరిక చరిత్రలో మొదట మాతృస్వామ్య వ్యవస్థ ఉండేదని, కానీ ప్రపంచం మొత్తం పితృస్వామ్య వ్యవస్థలోకి వెళ్ళిందన్నారు. దీనివల్ల మహిళలు తమ ఆర్థిక స్వతంత్రతను కోల్పోయారని అన్నారు. కానీ కాలం మారిందని, అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ పోటీలను 72 ఏళ్ల తర్వాత తెలంగాణ వేదికవ్వడం మార్పుకు సంకేతమన్నారు. అందం అంటే బాహ్య సౌందర్యం కాదని, అందమంటే అంతర్గత శక్తి సామర్థ్యాలు, మేధస్సు, స్వేచ్ఛ భావన, స్థితప్రజ్ఞత అని వివరించారు. మహిళలు కోల్పోయిన ఆర్థిక స్వతంత్రతను, సాధికారతను తిరిగి సాధించేందుకు తెలంగాణలో ఇందిరా మహిళా శక్తి విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. సాధికారత అంటే విద్యకు, ఉపాధికి, ఆర్థిక శక్తికి, సమాన హక్కులకు అవకాశాలు కల్పించడమని, గ్రామీణ పేదరిక మహిళల ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

ఇందిరా మహిళా శక్తి బజార్ మహిళల కళలు, నైపుణ్యం, కష్టపడే తత్వానికి కలబోతగా నిలుస్తోందన్నారు. సుందరీమణులు, గ్రామీణ శ్రామిక మహిళలు సమానమే అని చాటి చెప్పేందుకు మిస్ వరల్డ్ పోటీ దారులను ఇక్కడికి ఆహ్వానించామన్నారు. ఇది కేవలం ఒక మార్కెట్ కాదని, సామాజిక మార్పుకు ఇది ఒక సంకేతమని అన్నారు. తెలంగాణ మహిళల స్ఫూర్తిని శక్తిని మీలో నింపుకుని ముందుకు తీసుకెళతారని ఆశిస్తున్నానని అన్నారు. తెలంగాణ..జరూర్ ఆనా.. బార్ బార్ ఆనా అంటూ మిస్ వరల్డ్ పోటీదారులకు ధన్యవాదాలు తెలిపారు.

# శిల్పారామం వద్ద మిస్ వరల్డ్ పోటీదారుల సందడి.

**బలగం టీవీ, హైదరాబాద్**



మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల పర్యటనతో హైదరాబాద్ శిల్పారామం సందడిగా మారింది. శిల్పారామానికి చేరుకున్న ప్రపంచ అందగత్తెలకు పర్యటక శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఘనస్వాగతం పలికారు.ప్రత్యేక వాహనాల్లో శిల్పారామంలో చక్కర్లు కొట్టారు. శిల్పారామంలోని స్టాల్స్‌ను సందర్శించి.. వివిధ రకాల ఉత్పత్తులను గురించి అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ ఆడి సందడి చేశారు..ఇక.. మిస్ వరల్డ్ పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. టీ హబ్‌లో నిర్వహించిన హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో నాలుగు ఖండాల నుంచి 24 మంది విజేతలుగా నిలిచారు. టాప్ 24లో మిస్ ఇండియా నందిని గుప్తా చోటు దక్కించుకున్నారు. అమెరికన్, కరీబియన్, ఆఫ్రికా, యూరప్, ఏషియా, ఓసియానా ఖండాల వారీగా తదుపరి రౌండ్‌లకు విజేతలను ఎంపిక చేయనున్నారు. ఖండాల వారీగా టాప్‌లో నిలిచిన వాళ్లకు ఈ నెల 31న జరిగే మిస్ వరల్డ్ ఫైనల్ పోటీలో చోటు దక్కనుంది.

# హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నగర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పర్యావరణ హిత ప్రజారవాణాను ప్రోత్సహించే దిశగా చేపట్టిన పిఎం ఈ-డ్రైవ్ పథకం కింద నగరానికి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, కాలుష్య నియంత్రణకు దోహదపడనుంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించారు. పథకం ప్రస్తుత దశలో బెంగళూరుకు సుమారు 4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1,000, సూరత్‌కు 600 బస్సులతో పాటు హైదరాబాద్‌కు 2 వేల ఎలక్ట్రిక్ బస్సులను అందజేయనున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ, భారతదేశం సుస్థిర పట్టణ రవాణా దిశగా దృఢమైన అడుగులు వేస్తోందన్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు, నగరాలు ప్రజారవాణాను మరింత పరిశుభ్రంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఎలక్ట్రిక్ బస్సులను చురుకుగా స్వీకరిస్తున్నాయని తెలిపారు. 'మేము కేవలం ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించడమే కాకుండా, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ స్పృహతో భారతదేశ రవాణా వ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాం' అని ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పిఎం ఈ- డ్రైవ్ హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని కుమారస్వామి పేర్కొన్నారు.

పిఎం ఈ -డ్రైవ్ కార్యక్రమం ద్వారా ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2026 వరకు రెండేళ్ల కాలంలో రూ.10,900 కోట్ల మొత్తం ఆర్థిక వ్యయంతో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ప్రయత్నాలలో ఒకటిగా నిలుస్తుందని, సకాలంలో బస్సుల పంపిణీ, కార్యాచరణ సంసిద్ధత, భాగస్వామ్య రాష్ట్రాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద డిమాండ్ ఇన్సెంటివ్‌ను పొందేందుకు ఈవీ కొనుగోలుదారులకు ఈ- వోచర్లను కూడా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిందన్నారు. పిఎం ఈ-డ్రైవ్ పథకంలో భాగంగా ఈ -అంబులెన్స్‌లు, ఈ- ట్రక్కుల కోసం కూడా చెరో రూ.500 కోట్లు కేటాయించారు. రోగుల సౌకర్యవంతమైన రవాణా కోసం ఈ -అంబులెన్స్‌ల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ పథకం ఉద్దేశ్యం. వాయు కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్న ట్రక్కుల స్థానంలో ఈ- ట్రక్కులను కూడా పథకంలో చేర్చార్చినట్లు వెల్లడించారు.

# గ్రూప్-2 సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రూప్-2 అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక ప్రకటనను జారీ చేసింది. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తూ.. ఈ నెల 27 నుంచి జూన్ 7 వరకు ధృవీకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపింది. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారం అర్హులైన అభ్యర్థులకు ఇప్పటికే పంపినట్లు పేర్కొంది. మరిన్ని వివరాలకు టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https://www.tspsc.gov.in ను సందర్శించాలని సూచించింది.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు హాజరయ్యే అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు, ఒక సెట్ సంతకం చేసిన ఫోటోకాపీలను తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో వెరిఫికేషన్‌కు హాజరుకాకపోతే, లేదా వెబ్ ఆప్షన్స్ సరిగా నమోదు చేయకపోతే, అటువంటి అభ్యర్థులను అనర్హులుగా ప్రకటిస్తామని కమిషన్ స్పష్టం చేసింది. ఇలాంటి ఖాళీల కోసం మరింతమంది అభ్యర్థులను అదనంగా పిలవనున్నట్లు వెల్లడించింది. కావున ఎంపికైన అభ్యర్థులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సమయానికి హాజరై, అవసరమైన పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉందని టీజీపీఎస్సీ పేర్కొంది. ఇతర అవసరమైన వివరాల కోసం టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కమిషన్ కోరింది.

# కొండగట్టులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**బలగం టీవీ, హైదరాబాద్**



హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు కు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆంజనేయస్వామి మాలధారులు దీక్షా విరమణ చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున కొండగట్టులో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లను కలెక్టర్ పరిశీలించారు. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా భక్తులు, మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు.

# పహల్గామ్ దాడి వెనుక పాక్ ఆర్మీ చీఫ్ మతతత్వం

● భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్

**బలగం టీవీ, హైదరాబాద్**



జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ తీవ్ర మతతత్వ దృక్పథం ఉందని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఆరోపించారు. ఆ ఉగ్రదాడికి దారితీసింది మునీర్ మతతత్వమేనని ఆయన అన్నారు. ఈ దాడిలో ఉగ్రవాదులు మతాన్ని ప్రాతిపదికగా చేసుకుని 26 మంది అమాయక పౌరులను దారుణంగా హత్య చేశారని ఆయన గుర్తుచేశారు. కశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన పర్యాటకాన్ని దెబ్బతీయడానికి, ఉద్దేశపూర్వకంగా మత ఘర్షణలు సృష్టించడానికే ఈ దాడికి పాల్పడ్డారని జైశంకర్ ఒక డచ్ బ్రాడ్‌కాస్టర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ (ప్రస్తుతం ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి పొందారు) ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా ఆయన మతతత్వ వైఖరిని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. "తాము హిందువుల కంటే భిన్నమని మీ పిల్లలకు బోధించండి" అని పాక్ పౌరులకు మునీర్ పిలుపునివ్వడం, కశ్మీర్‌ను పాకిస్థాన్ 'జీవనాడి'గా అభివర్ణించడం వంటివి ఉద్రిక్తతలను మరింత పెంచాయని జైశంకర్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలకు, ఉగ్రవాదుల చర్యలకు మధ్య స్పష్టమైన సంబంధం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఇదే సమయంలో, పీఓకే భారత్‌లో అంతర్భాగమని, దానిని పాకిస్థాన్ తిరిగి అప్పగించాలని జైశంకర్ మరోసారి డిమాండ్ చేశారు.

# శ్రీశైలం, సాగర్ నుంచి నీటి విడుదల..

**బలగం టీవీ, హైదరాబాద్**



వేసవిలో నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ, ఏపీలకు కృష్ణా జలాలను విడుదల చేయడానికి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయించింది. శ్రీశైలం, సాగర్ జలాశయాల నుంచి నీటిని విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తాగునీటి అవసరాల కోసం ఏపీకి నాలుగు టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు కేఆర్ఎంబీ పేర్కొంది. ఈ నీటి వినియోగానికి సంబంధించి ప్రాజెక్టుల్లో నీటిమట్టాలపై సైతం బోర్డు క్లారిటీ ఇచ్చింది. శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల వరకు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 505 అడుగుల వరకు నీటిని వాడుకోవడానికి మాత్రమే అనుమతులు ఇచ్చింది. ఏపీ అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా రోజుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ చెప్పింది. శ్రీశైలంలో నీటి నిల్వ విషయంలో బోర్డు కీలక సూచనలు చేసింది. జులై నెలాఖరు వరకు శ్రీశైలం ప్రాజెక్టులో కనీసం 800 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగించాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది.

# ఆపదలో అండగా నిలిచిన కేటీఆర్

**బలగం టీవీ, తంగళ్లపల్లి**



బతుకుదెరువు కోసం ఎడారి దేశం పోయిన యువకున్ని వెక్కిరించిన విధి సౌదీలో 15 రోజుల క్రితం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు తనతో పాటు ప్రయాణిస్తున్న 8 మంది మృతి చెందగా ఒక్కడే తీవ్ర గాయాలతో బయటపడ్డ రాజన్న సిరిసిల్ల జిల్లా మండేపల్లికి చెందిన మంద మహేష్.సెల్ఫీ వీడియో ద్వారా తనను స్వదేశానికి తీసుకెళ్ళాలని కేటీఆర్ ను మహేష్ వేడుకున్నారు. మహేష్ కుటుంబ సభ్యులను కలిసి వారితో పాటు,మహేష్ కి కూడా ధైర్యం చెప్పారు.ఆదుకుంటానని భరోసానిచ్చిన కేటీఆర్ వెంటనే తన టీంను రంగంలోకి దింపి, సౌదీలోని మహేష్ కంపెనీ వాళ్ళతో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో మహేష్ కు ట్రీట్మెంట్ చేస్తామని అంగీకరిస్తూ సౌదీలోని ప్రభుత్వ ఆసుపత్రికి లేఖ రాసిన కిమ్స్ యాజమాన్యంచెప్పినట్లుగానే సౌది దవాఖాన నుంచి నేడు మహేష్ ని మండేపల్లికి చేర్చిన కేటీఆర్ బృందం.ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కేటీఆర్ కు కుటుంబ సభ్యులు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు..

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భాగ్యరెడ్డి వర్మ ఒక గొప్ప సంఘ సంస్కర్త, దళితు వైతాళికుడు అని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. గురువారం దళిత వైతాళికులు,సంఘ సంస్కర్త భాగ్యారెడ్డి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ స్వాతంత్ర్యంకు ముందు దళితుల హక్కులు, సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని అన్నారు. హైదరాబాద్ సంస్థానంలో అనేక దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వేల మంది విద్యార్థులకు విద్య అందించి వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడనిఅన్నారు.స్వాతంత్ర్య రాక ముందే సమాజంలో నెలకొని ఉన్న అనేక సామాజిక వివక్షత లు,అసమానతలు,మూడ నమ్మకాలపై గళమెత్తి పోరాటం చేశారని,జోగిని,దేవదాసి వ్యవస్థలపై పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మ, ఆర్.ఐ యాదగిరి,ఆర్.ఎస్.ఐ జునైద్,కార్యాలయా సిబ్బంది పాల్గొన్నారు..



# మాదకద్రవ్యాలు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో మాదకద్రవ్యాలు (డ్రగ్స్) నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఎస్పీ మహేష్ బి గితే, ఇతర అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పాఠశాలలో పరిసరాల్లో ఉన్న పాన్ షాప్ వంటి వాటి పై నిఘా పెట్టాలని అన్నారు. పాఠశాలలు మరియు కళాశాలలు పునఃప్రారంభం జరిగిన తర్వాత డ్రగ్స్ నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చూడాలని అన్నారు. ప్రతి మండలంలో తహసిల్దార్, ఎంపిడిఓ, పోలీస్, మండల వ్యవసాయ అధికారి వైద్య అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి దాని నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఉన్న బార్, వైన్ షాప్ ప్రభుత్వ నిర్దేశిత సమయపాలన పాటించేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఉన్న సినిమా థియేటర్ల పరిసరాలను రాత్రి సమయంలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని, జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు, ఇటుక బట్టీల వద్ద అసిస్టెంట్ లేబర్ అధికారి ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వీటిలో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలు వివరించే వీడియోలను, పోస్టర్లను ప్రదర్శించాలని అన్నారు. డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన యూరిన్ కిట్లను పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారుల వద్ద అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్యారోగశాఖ అధికారికి సూచించారు. కళాశాలలో సడన్ గా వింతగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించాలని, ఎవరైనా డ్రగ్స్ గంజాయి తీసుకుంటున్నట్లు తెలిస్తే వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందజేయాలని అన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి అలవాటు ఉన్నట్లు ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెంట్ ప్రవీణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలీ బేగం, అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రగ్ ఇన్స్పెక్టర్ భవాని, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎక్సైజ్ విద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణకు పకడ్బందీగా చర్యలు..

**-శృంగేరి పీఠం అనుమతితో ఆలయ అభివృద్ధి పనులు**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



గతంలో పాలకులు వేములవాడ ఆలయానికి 100 కోట్లు విడుదల చేస్తామని మోసం చేశారని, నేడు ప్రజా ప్రభుత్వంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రణాళికా బద్ధంగా విస్తరణ పనులు చేపడుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో రెండో విడత క్రింద 484 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండ్లు లేని నిరు పేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళు మంజూరు చేస్తుందని అన్నారు. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల రాలేదని అన్నారు. రాబోయే 4 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మనం ప్రాంతంలో వేయి కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. వర్షాకాలం ముగిసిన తర్వాత 3వ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని,గుడి చెరువు లో మురుగు నీరు కల్వకుండా 9 కోట్ల ఖర్చు చేసి నివారణ చర్యలు చేపట్టామని అన్నారు. మూల వాగు శుభ్రం చేస్తున్నామని అన్నారు. వేములవాడ ఆలయ విస్తరణకు పకడ్బందీగా చర్యలు చేపట్టామని, ఆలయం మూసివేస్తామని అపోహలు సృష్టిస్తున్నారని, భక్తులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి నిత్యం స్వామివారికి నిత్యకృత్యం కైకంకర్యాలు జరుగుతాయని అన్నారు.

గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం , 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని అన్నారు. 400 గజాల నుంచి 600 గజాల లోపు ఏంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా 5 లక్షల సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ దశలో 1లక్ష రూపాయల, గోడల దశలో 1లక్ష వేలు, స్లాబ్ దశలో 2లక్షలు ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు.

ఇంటి జాగా లేని నిరు పేదలకు కూడా రెండవ దశలో ఇండ్లు తప్పకుండా ఇస్తామని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో పేదలకు అసైన్మెంట్ భూముల పంపిణీ చేసింది తమ హయంలో మాత్రమేనని, గత 10 సంవత్సరాల కాలంలో అసైన్మెంట్ కమిటీలు లేవని, నేడు మరోసారి భూ భారతి లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇంటి స్థలాలు అందిస్తామని అన్నారు. రాజీవ్ యువ వికాసం క్రింద 4 వేల మంది యువతకు త్వరలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు సబ్సిడీ విడుదల చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి స్థాయి సహకారం అందిస్తామని, ప్రభుత్వం తరపున ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ భూమి లేని నిరు పేదలకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పూర్తి చేసి అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే తో కలిసి ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం రాబోయే రోజుల్లో భూమి లేని నిరు పేదలకు ఇంటి పట్టాల పంపిణీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలో నేడు పంపిణీ చేసిన 484 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు 30 రోజుల లోగా ప్రారంభించాలని అన్నారు. ఇంటి నిర్మాణంలో పేదలకు పూర్తి సహకారం అందిస్తామని, పెట్టుబడి లేని పేదలకు లక్ష రూపాయలు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు వైస్ చైర్మన్ రాకేష్ సెస్ డైరెక్టర్ ఉమా ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పాలనాధికారి పరీక్షను సజావుగా నిర్వహించాలి



**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ మే 25 ఆదివారం నాడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలకు సిరిసిల్ల జిల్లాలో 65 మంది అభ్యర్థులు హాజరవుతారని, గీత నగర్ లోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నోడల్ అధికారిగా ఈ పరీక్షలు జరుగుతాయని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు ప్రశ్నాపత్రాలు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్%ea% చేతి గడియారాలు అనుమతి లేదని అన్నారు. పరీక్షల ముగిసిన తర్వాత అభ్యర్థుల జవాబు పత్రాలను సీజ్ చేసి ఎస్కార్ట్ తో కన్వీనర్ జేఎన్టీయూ హైద్రాబాద్ కు పంపాలనిఅన్నారు.

పరీక్ష కేంద్రంలో ప్రతి బెంచ్ కు ఒక అభ్యర్థి ఉండేలా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 10 గంటలకు మూసివేయడం జరుగుతుందని గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలో గోడ గడియారాలు ఏర్పాటు చేయాలని,ప్రతి అరగంటకు అభ్యర్థులకు సమయం తెలిసేందుకు మోగాలని , పరీక్ష కేంద్రాల పరిసరాల్లో న జిరాక్స్ షాపులను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్ ప్రిన్సిపల్ శారద ఎం.డి.సెస్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలి..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని రెడ్ క్రాస్ కమిటీ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ.ఆర్.సీ.ఎస్) సేవలు, ఎన్నికల నిర్వహణ ,సభ్యత్వాల నమోదు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ గడువు తేదీ 8.5.2025 నాటికి ముగిసిన నేపథ్యంలో నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. వేములవాడ లోని ఏరియా హాస్పిటల్ ఆవరణలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించామని తెలిపారు. భవన నిర్మాణానికి నిధులు దాతల నుంచి సేకరించాలని, ఐఆర్సీఎస్ రాష్ట్ర చైర్మన్ గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే నూతన సభ్యత్వాలు చేయించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు, ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రాయకరరావు వేణు కుమార్, ప్రధాన కార్యదర్శి తాటిపాముల శివప్రసాద్, కోశాధికారి బుడిమె శివప్రసాద్, కమిటీ సభ్యులు సంగీతం శ్రీనివాస్, యెల్ల లక్ష్మీనారాయణ, దేవులపల్లి రాజమల్లు, చిదుర నాగ శంకర్, కమటాల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్ టైటాన్స్‌కు లక్నో షాక్

- 33 పరుగుల తేడాతో గెలుపు
- చెలరేగి ఆడిన మిచెల్ మార్ష్





**బలగం టీవీ, హైదరాబాద్**

ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్త్ దక్కించుకున్న గుజరాత్ టైటాన్స్‌కు లక్నో సూపర్ జెయింట్స్ షాకిచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ను 33 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్ చిత్తు చేసింది. 236 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కొల్పొయి 202 పరుగులు చేసింది.

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు తరఫున మిచెల్ మార్ష్ సెంచరీ(117), నికోలస్ పూరన్ అర్థ సెంచరీ(56లి)తో చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేయగలిగింది. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్, సాయి కిషోర్ తలో వికెట్ తీశారు.

అనంతరం ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 202 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విధంగా గుజరాత్ తన సొంత మైదానంలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. షారుఖ్ ఖాన్(57), రూథర్‌ఫోర్డ్(38) అద్భుతంగా బ్యాటింగ్ చేసారు. కానీ జట్టును గెలిపించడంలో విఫలమయ్యారు. సాయిసుదర్శన్(21), శుభ్ మన్ గిల్(35), జోస్ బట్లర్(33) ఈ మ్యాచ్ లో భారీ స్కోర్లు చేయలేకపోయారు. రాహుల్ తెవాటియా(2) కూడా నిరాశపరిచారు. లక్నో బౌలర్లలో విలియా ఓరూర్కే 2 వికెట్లు పడగొట్టగా.. ఆయుష్ బదోని, అవేష్ ఖాన్ తలో 2 వికెట్లు తీశారు. ఆకాశ్ మహరాజ్ సింగ్, షాబాజ్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.

అంతకుముందు, టాస్ ఓడిపోయి బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ అద్భుతమైన ఆరంభాన్ని సాధించింది. ఐడెన్ మార్‌క్రమ్ , మిచెల్ మార్ష్ తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఐడెన్ మార్‌క్రమ్ 24 బంతుల్లో 36 పరుగులు చేసి ఔటయ్యాడు.మార్‌క్రమ్ ఔట్ అయిన తర్వాత, మార్ష్ పూరన్ బాధ్యతలు స్వీకరించారు. మార్ష్ బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. మార్ష్ 64 బంతులు ఎదుర్కొని 117 పరుగులు చేశాడు. అదే సమయంలో, పూరన్ 27 బంతుల్లో 207 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 56 పరుగులు చేశాడు. చివరికి, రిషబ్ పంత్ 6 బంతుల్లో 16 పరుగులు చేసి లక్నోను 2 వికెట్ల నష్టానికి 235 పరుగులకు తీసుకెళ్లాడు.

## 24న టెస్టు కెప్టెన్ ఎంపిక

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమ్ ఇండియా జూన్ 20నుంచి ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో అక్కడ ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. దీనికి సంబంధించి భారత జట్టును, నాయకుడ్ని ఈ నెల 24న ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శనివారం సెలక్షన్ కమిటీ సమావేశం అనంతరం దీనిపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కొద్ది రోజుల క్రితమే రోహిత్‌శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అప్పటినుంచి నూతన టెస్ట్ కెప్టెన్ ఎంపికకు సంబంధించి పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. వీరిలో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా , రిషభ్ పంత్ పేర్లు ఎక్కువగా వార్తల్లో నిలిచాయి. అయితే వీరిలో బుమ్రా కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకొన్నట్లు సమాచారం. అతడు కొన్ని మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్న నేపథ్యంలో సారథ్య బాధ్యతలు దక్కడం అనుమానమే. భారత టెస్టు జట్టులో శుభ్‌మన్ గిల్ స్థానం ఇంకా సుస్థిరం కాలేదు. ఈ నేపథ్యంలో అతడికి సారథ్య బాధ్యతలు అప్పగించడంపై సెలక్టర్లలో ఒకరు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మొదట అతడికి వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగిస్తే మేలని అభిప్రాయపడినట్లు సమాచారం. ఏది ఏమైనా బిసిసిఐ నుంచి అధికారిక ప్రకటన వస్తేనే ఈ ఊహాగానాలకు తెరపడుతుంది.



## సెట్స్ నుంచి ఫోటో పంచుకున్న పెద్ది టీం

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఈ షెడ్యూల్‌లో భారీ పోరాట సన్నివేశాలతో పాటు, చిత్రంలోని ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. తాజాగా హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. సెట్స్ నుంచి కొత్త ఫొటోను పంచుకుంది టీమ్. ఇందులో దర్శకుడు బుచ్చిబాబు సానాతో పాటు రామ్ చరణ్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కలిసి ఉన్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 మార్చి 27న విడుదల కానుంది.

## కేన్స్‌లో 'విశ్వంభర' బుక్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు వశిష్ట దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. తాజాగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'విశ్వంభర బుక్'ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పుస్తకం విడుదల సందర్భంగా, "విశ్వంభర మీ ముందుకు ఓ అద్భుతమైన ప్రపంచాన్ని తీసుకొస్తోంది. ఇంతకీ ఆ బుక్‌లో ఏముందో తెలియాలంటే వెయిట్ చేయండి" అంటూ నిర్మాణ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది.


ఈ పుస్తకం విడుదల తర్వాత, త్వరలోనే సినిమా టీజర్‌ను కూడా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సోషియో ఫాంటసీ చిత్రం ప్రేక్షకులకు ఎలాంటి అద్భుతమైన దృశ్యానుభూతిని పంచుతుందో చూడాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

## సల్మాన్ ఖాన్ ఇంట్లోకి చొరబడిన మహిళ..

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ భద్రత విషయంలో మరోసారి ఆందోళనకర సంఘటన చోటుచేసుకుంది. ఇప్పటికే గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి తీవ్ర బెదిరింపులు ఎదుర్కొంటున్న సల్మాన్ నివాసంలోకి ఓ మహిళ చొరబడేందుకు ప్రయత్నించడం కలకలం రేపింది. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో ఉన్న సల్మాన్ ఖాన్ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన జరిగింది. ఇషా ఛబ్రా అనే మహిళ గురువారం సల్మాన్ నివాసం ఉండే భవనంలోని లిఫ్ట్ ఏరియా వరకు వెళ్లింది. ఆమె నటుడి నివాసంలోకి ప్రవేశించే లోపే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. వెంటనే సదరు మహిళను అదుపులోకి తీసుకున్న సెక్యూరిటీ సిబ్బంది, బాంద్రా పోలీసులకు సమాచారం అందించి, ఆమెను వారికి అప్పగించారు. భద్రతా సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అలాగే రెండ్రోజుల క్రితం ఓ వ్యక్తి ఓ కారు చాటున నక్కి సల్మాన్ నివాసంలోకి ప్రవేశించే ప్రయత్నం చేయడం తీవ్ర కలకలం రేపింది. అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణ జింకల వేట కేసుకు సంబంధించి సల్మాన్ ఖాన్‌పై ప్రతీకారం తీర్చుకుంటానని జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పలుమార్లు హెచ్చరించిన విషయం తెలిసిందే.





## ఇంగ్లాండ్ పర్యటనకు భారత అండర్-19 జట్టును ప్రకటించిన బీసీసీఐ..

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లాండ్ పర్యటన కోసం భారత అండర్-19 జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఈ పర్యటనలో భారత జట్టు మొత్తం 8 మ్యాచ్‌లు ఆడనున్నది. ఇందులో ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో ఒక వార్మప్ మ్యాచ్, ఐదు వన్డేలు, రెండు మల్టీ-డే మ్యాచ్ ఆడనున్నది. ఈ సిరీస్ జూన్ 24 నుంచి మొదలవనున్నది. భారత అండర్-19 జట్టు కెప్టెన్‌గా చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ ఆయుష్ మాత్రే వ్యవహరించనున్నారు. ముంబయి వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ అభిజ్ఞాన్ కుందును వైస్‌కెప్టెన్‌గా నియమించింది. అదే సమయంలో 14 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి సైతం జట్టులో చోటు దక్కింది. ఈ మేరకు బీసీసీఐ ప్రెస్‌నోట్ విడుదల చేసింది.

జూన్ 24 నుంచి జూలై 23 వరకు ఇంగ్లాండ్ పర్యటన కోసం భారత అండర్-19 జట్టును ఎంపిక చేసిందని పేర్కొంది. ఈ పర్యటనలో 50 ఓవర్ల ప్రాక్టీస్ మ్యాచ్, ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్, ఇంగ్లాండ్ అండర్-19తో రెండు మల్టీ-డే మ్యాచ్‌లు ఉంటాయని పేర్కొంది.

### భారత అండర్-19 జట్టు

ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్‌సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుండు (వైస్ కెప్టెన్ -వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), ఆర్ఎస్ అంబరీష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, యుధాజిత్ గుహా, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఎనాన్, ఆదిత్య రాణా, అన్మోల్‌జిత్ సింగ్.

స్టాండ్ బై ప్లేయర్స్ : నమన్ పుష్పక్, డీ దీపేష్, వేదాంత్ త్రివేది, వికల్ప్ తివారీ, అలంకృత్ రాపోల్ (వికెట్ కీపర్).

## ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్‌కు భారీ జరిమానా

**బలగం టీవీ, హైదరాబాద్**



బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌పై ముంబై ఇండియన్స్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌కు సంబంధించి ఢిల్లీ ఆటగాడికి భారీ జరిమానా విధించారు. ఢిల్లీ ఫాస్ట్ బౌలర్ ముఖేష్ కుమార్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించారు. మ్యాచ్ సమయంలో క్రికెట్ పరికరాలు లేదా దుస్తులు, గ్రౌండ్ పరికరాలు, ఫిట్టింగ్‌లను దుర్వినియోగం చేయడానికి సంబంధించిన ఆర్టికల్ 2.2 కింద లెవెల్ 1 ఉల్లంఘనకు ముఖేష్ కుమార్‌కు ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇవ్వబడింది."ముఖేష్ కుమార్ ఐపీఎల్ ఆర్టికల్ 2.2 లెవెల్ 1 ఉల్లంఘనను అంగీకరించారు."అని ఐపీఎల్ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రవర్తన నియమావళి మొదటి స్థాయి ఉల్లంఘనకు మ్యాచ్ రిఫరీ నిర్ణయం చెల్లుతుంది. బుధవారం ముఖేష్ కుమార్ తన 4 ఓవర్లలో 48 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ చివరి ఓవర్లో 3 సిక్సర్లు, రెండు ఫోర్లతో 27 పరుగులు వచ్చాయి.

## మలేషియా మాస్టర్స్ క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్

**బలగం టీవీ, హైదరాబాద్**



మలేషియా మాస్టర్స్‌లో పురుషుల సింగిల్స్‌లో స్టార్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఐర్లాండ్ ఆటగాడు నాట్ గుయెన్‌ను చిత్తుగా ఓడించాడు. శ్రీకాంత్ రెండో రౌండ్‌లోనూ దుమ్మురేపాడు. తొలి రౌండ్‌లో లూ గాంజ్ జూ(చైనా)ను చిత్తు చేసిన భారత ఆటగాడు గురువారం కూడా అదే జోరు చూపించాడు. 33వ ర్యాంకర్ అయిన గుయెన్‌కు చుక్కలు చూపించాడు. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌ను 23-21తో గెలుచుకున్న శ్రీకాంత్.. రెండో సెట్‌లో మరింత చెలరేగాడు. దాంతో, ప్రత్యర్థి వెనకబడగా.. 21-17తో భారత స్టార్ క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో ద్వయం అద్భుతంగా ఆడింది. ఫ్రాన్స్‌కు చెందిన జులియన్ మయివో లీ పలెమోపై మూడు సెట్ల పోరులో 21-17, 18-21, 21-15తో అలవోకగా గెలుపొందింది. అయితే.. కుర్రాళ్లు హెచ్ఎస్ ప్రణయ్, ఆయుశ్ శెట్టి, కరుణాకరన్‌లకు మాత్రం ఓటమి పాలయ్యారు.